



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM


## సమ్మర్‌లో బయటికి వెళ్తున్నారా..
## ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

సమ్మర్‌లో బయటికి వెళ్లేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ తీసుకోవాలి. తప్పనిసరిగా వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి. నీరు ఎక్కువగా ఉండే సొరకాయ, దోసకాయ, పొట్లకాయ తీసుకోవాలి. వేడి తగ్గుతుందని కూల్‌డ్రింగ్స్ తాగకూడదు. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ కార్బోనేటేడ్ శీతల పానీయాలను మానేయాలి.





## ఎమ్మెల్సీ కవిత కస్టడీ మరో మూడు రోజులు పొడిగింపు

తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. ఇప్పటికే కవితకు విధించిన ఏడు రోజుల కస్టడీ గడువు నేటితో ముగియడంతో.. ఈడీ అధికారులు ఆమెను ఇవాళ కోర్టులో ప్రవేశపెట్టారు. మరో మూడు రోజులు ఆమెను తమకు కస్టడీకి ఇవ్వాలని కోరారు. దాంతో కోర్టు కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగించింది. అంతకుముందు కోర్టులోపలికి వెళ్తూ ఆమె.. ఈడీ విచారణపై అసహనం వ్యక్తంచేశారు. ఏడాది నుంచి అడిగిన వివరాలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని అన్నారు. తనపై పెట్టింది రాజకీయ కేసని, తప్పుడు కేసని, ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసని వ్యాఖ్యానించారు. తన అరెస్టు పూర్తిగా చట్ట విరుద్ధమని, కోర్టులో న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. కాగా, కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగించాలని ఈడీ తరఫు న్యాయవాదులు కోరారు.




## పొన్నం ప్రభాకర్ ను ఆవేశం స్టార్ అని పిలవాలి..

పొన్నం ప్రభాకర్ ఆవేశాన్ని చూస్తుంటే ఆవేశం స్టార్ అని పిలవాలని ఉందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ పై చర్యలు తీసుకోవాలని మరోసారి స్పీకర్ ని కోరుతున్నానని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఓట్లేసి మమ్మల్ని ప్రజలు గెలిపించారు.. అటువంటి మమ్మల్ని అధికార కార్యక్రమంలో భాగస్వామ్యం చేయొద్దని ఎలా అంటారని తెలిపారు. ఆర్డీవో కి ఫోన్ చేసి బెదిరిస్తున్నారు.. సీఎస్ కి కంప్లైంట్ చేశానని అంటున్నారు మంత్రి అని అన్నారు. ప్రమాణం కి భిన్నంగా ప్రవర్తిస్తున్న మంత్రిని ఎందుకు బర్తరఫ్ చేయవద్దు? అని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఆవేశాన్ని చూస్తుంటే ఆవేశం స్టార్ అని పిలవాలని ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు.

# యుద్ధంలో గెలిచి తీరాలి..
# చంద్రబాబు దిశానిర్దేశం

ఎన్నికల యుద్ధంలో గెలిచి తీరాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు అధ్యక్షతన విజయవాడలో జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదని.. రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి ముందుకెళ్తున్నామన్నారు. వైసీపీ కుట్రలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలన్నారు. గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున ఏ అభ్యర్థి పోటీ చేసినా గెలిపించాలని, మూడు పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. రాజకీయ పార్టీ ప్రయోజనం కోసమో.. గెలిచే అభ్యర్థుల ప్రయోజనాల కోసం తాను ఆలోచించడం లేదని రాష్ట్ర భవిష్యత్తు కోసమే ఆలోచిస్తున్నట్లు చెప్పారు. గాడి తప్పిన పాలనను గాడిలో పెట్టడమే తన ముందున్న లక్ష్యమని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చాలా కసరత్తు తర్వాత అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలో ఎప్పటినుంచో ఉంటున్న కొందరికి టికెట్లు ఇవ్వలేకపోయామని.. వైసీపీని బలంగా ఎదుర్కొనేందుకు కొన్ని నిర్ణయాలు తీసుకోవల్సి వచ్చినట్లు చంద్రబాబు వివరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.



**ఓట్లు చీలకూడదు..**

ఈ ఎన్నికల్లో ఓట్లు చీలకూడదనే లక్ష్యంతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముందుకు వచ్చారని మన లక్ష్యం కూడా అదేనని చంద్రబాబు తెలిపారు. పొత్తులపై అసత్యాలు ప్రచారం చేస్తూ వైసీపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మకుండా.. కూటమి అభ్యర్థులనే రాష్ట్ర వ్యాప్తంగా గెలిపించాలని కోరారు. తాను 160 నియోజకవర్గాల్లో 160 సభల్లో పాల్గొంటానని.. 160 నియోజకవర్గాల్లో కూటమిని గెలిపించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**విశాఖ డ్రగ్స్ కేసులో ఉన్నది వైసీపీ నేతలే.. ఆధారాలతో బయటపెట్టిన చంద్రబాబు!**

విశాఖ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్నది వైసీపీ నాయకులేనని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. వైసీపీ నాయకులతో నిందితులకు సంబంధాలున్నాయనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. విజయవాడ టీడీపీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. కూనం వీరభద్రరావుకు వైసీపీ నాయకులతో సంబంధాలున్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫెక్సీల్లో జగన్, వైసీపీ నేతల ఫోటోలు ఉన్నాయని.. దీనికి సమాధానం చెప్పకుండా తిరిగి తమపై దాడి చేసేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చేశారని ఆరోపించారు.

**డ్రగ్స్ కేసులో వైసీపీ నేతలు..**

ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. గతంలో కాకినాడ ఎమ్మెల్యే డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే.. ఆ కేసులో ఇప్పటిరవకు ఎటువంటి పురోగతి లేదన్నారు. వైసీపీ నేతల అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని.. ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. డ్రగ్స్ మాఫియా నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవల్సిన అవసరం ప్రజలపైనే ఉందన్నారు. డ్రగ్స్‌పై సీఎం జగన్ ఒక్కసారైనా సమీక్ష చేశారా అని చంద్రబాబు ప్రశ్నించారు.

## ధోని భాయ్ ఉన్నాడు కాబట్టే గెలిచాం: రుతురాజ్

అందుకున్నాడు యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్. ఐపీఎల్-2024 ఆరంభ మ్యాచ్‌లో పటిష్ఠ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో పోరులో సీఎస్‌కేను గెలిపించి సత్తా చాటాడు. సొంత మైదానం చెపాక్ వేదికగా గెలుపు నమోదు చేసి మధుర జ్ఞాపకాలు ప్రోది చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. కెప్టెన్సీని ఎల్లప్పుడూ ఆస్వాదిస్తానని తెలిపాడు. సారథిగా వ్యవహరించడం తనపై ఎలాంటి అదనపు ఒత్తిడిని కలిగించదని పేర్కొన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో మహారాష్ట్రను ముందుండి నడిపించిన అనుభవం తనకు ఉందని తెలిపాడు. వరుస విరామాల్లో మూడు వికెట్లు పడగొట్టడం తో మ్యాచ్ మా చేతుల్లోకి వస్తుందన్న నమ్మకం కుదిరింది. మా జట్టులోని ప్రతి ఒక్కరూ స్ట్రోక్ ప్లేయర్సే. జింక్స్(అజింక్య రహానే) కూడా సానుకూల దృక్పథంతో ఆడాడు. జట్టులోని ప్రతి ఒక్కరికి తమ పాత్ర ఏమిటన్న అంశంపై స్పష్టత ఉంది. ఈ రోజు బౌలర్లు తమ పాత్రను చక్కగా నెరవేర్చారు. అందరూ బాగానే బ్యాటింగ్ చేశారు. అయితే, టాపార్డర్ బ్యాటర్లు 15 ఓవర్ వరకు క్రీజులో ఉండగలిగితే మిగతా వాళ్ల పని మరింత సులువవుతుంది" అని రుతురాజ్ గైక్వాడ్ విశ్లేషించాడు.





## ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ యాదవ్ ఇంటిపై ఈడీ దాడి..

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరింత దూకుడు పెంచింది. ఇప్పటికే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆప్ పార్టీకి చెందిన ప్రధాన నాయకులను అరెస్టు చేసిన ఈడీ.. తాజాగా ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ యాదవ్ ఇంటిపై దాడిచేసింది. ప్రస్తుతం ఈడీ అధికారులు ఆయన నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం అరెస్టయిన కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు వారం రోజులు కస్టడీ విధించిన విషయం తెలిసిందే. కాగా, ఈడీ దాడులపై ఆప్ నాయకుడు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రతిపక్షాన్నే జైలుకు పంపించాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు దేశ ప్రజలకే కాదు మొత్తం ప్రపంచానికి అర్థమైందని చెప్పారు. ప్రస్తుతం ఈ దేశం రష్యా అడుగు జాడల్లో నడుస్తున్నదని, ఇదే విధంగా బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఉత్తర కొరియాలో కూడా జరిగిందని తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల ప్రాథమిక హక్కుల హననంతోపాటు ప్రతిపక్షాలను అంతమొందించడంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ప్రస్తుతం నియతృత్వంలోకి వెళ్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓ అక్రమ కేసులో తమ పార్టీ చెందిన నలుగురు అగ్రనాయకులు ప్రస్తుతం జైలులో ఉన్నారని చెప్పారు. తాము గుజరాత్‌లోని పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తున్నామని, ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి ఇంచార్జ్‌గా ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్‌పై ఈడీ దాడులు నిర్వహిస్తున్నదని విమర్శించారు. ఇలాగే మౌనంగా ఉంటే ఆప్‌తోపాఉ ఇతర ప్రతిపక్ష నాయకులపై ఇలాగే దాడులు జరిగే అవకాశం ఉందని చెప్పారు.



## ఎలుగుబంటి దాడి.. ఇద్దరు మృతి

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో ఎలుగుబంటి బీభత్సం సృష్టించింది. వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లి సమీపంలో ముగ్గురిపై దాడిచేసింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడగా, స్థానికులు అతడిని దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలుగుబంటిని బంధించేందుకు చర్యలు ప్రారంభించారు.

## ఉ.5.30 నుంచి 10.30 వరకే ఉపాధి పనులు

ఎండలు విపరీతంగా ఉన్నందున ఉపాధి హామీ పథకం కూలీలు అనారోగ్యానికి గురికాకుండా ఉదయం 5.30 నుంచి 10.30 వరకే పనులను నిర్వహించాలని ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. అలాగే, వారికి పెద్ద ఎత్తున పనులు కల్పించాలని ఆదేశించారు. జూన్ నెలాఖరు వరకు కరవు మండలాల్లో తాగు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మంచినీటి పథకాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.





## టీఎంసీ నేత మహువా మొయిత్రా ఇంట్లో సీబీఐ సోదాలు

పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడానికి ముడుపులు తీసుకున్నారని టీఎంసీ నేత, మాజీ ఎంపీ మహువా మొయిత్రాపై వచ్చిన ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే మహువా మొయిత్రా నివాసంలో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా నివాసంతో పాటు ఇతర నగరాల్లోని మహువాకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కాగా, యాంటీ కరప్షన్ అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ మహువా కేసుపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఆరు నెలల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టంచేసింది. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ తాజాగా సోదాలు చేపట్టింది. మరోవైపు ఈ కేసు కారణంగా మహువా లోక్‌సభ సభ్యత్వం రద్దయిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లోని క్రిష్ణానగర్ స్థానం నుంచి ఆమె మళ్లీ బరిలోకి దిగుతున్నారు.

## ఓటిటిలో రికార్డు రెస్పాన్స్ తో హను మాన్ హవా

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ అలాగే టాలెంటెడ్ యంగ్ నటి అమృత అయ్యర్ హీరోయిన్‌గా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన లేటెస్ట్ భారీ పాన్ ఇండియా హిట్ చిత్రం "హను మాన్". మరి మన తెలుగులో మొదటి సూపర్ హీరో సినిమాగా వచ్చిన ఈ చిత్రం థియేటర్స్ లో సెన్సేషనల్ హిట్ అయ్యి దాదాపు రెండు నెలలు తర్వాత ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చింది. మరి ఈ చిత్రం జీ5 ఓటిటిలో వచ్చాక గంటల్లోనే మిలియన్స్ కొద్దీ స్ట్రీమింగ్ మినిట్స్ ని నమోదు చేసింది. మరి ఈ చిత్రం ఇప్పుడు ఇదే రేంజ్ లో రికార్డు రెస్పాన్స్ తో దూసుకెళ్తుంది. మరి లేటెస్ట్‌గా అయితే ఈ చిత్రం 5 రోజుల్లో 200 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ ని క్రాస్ చేసినట్టుగా తెలుస్తుంది. దీనితో సింగిల్ లాంగ్వేజ్ లోనే ఈ చిత్రం అదరగొట్టేస్తుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రం మిగతా సౌత్ భాషల్లో అతి త్వరలోనే రిలీస్ కానుంది. ఇక ఈ చిత్రానికి గౌర హరీష్ సంగీతం అందించగా నిరంజన్ రెడ్డి నిర్మాణం వహించారు.





# అందరి దృష్టి రిషబ్ పంత్ పైనే..

గత ఐపీఎల్ లో పేలవమైన ప్రదర్శనను కనపరిచిన ఇరుజట్లు ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ ఈ సీజన్ ను మంచి శుభారంభం చేయాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం తలపడేందుకు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు మొహాలిలోని ముల్లన్ పూర్ లో కొత్తగా నిర్మించిన మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్ లో అందరి దృష్టి రిషబ్ పంత్ పైనే ఉంటుంది. డిసెంబర్ 2022లో జరిగిన కారు ప్రమాదంలో పంత్ తీవ్రంగా గాయపడ్డ తర్వాత బలమైన సంకల్పం కారణంతో అందులోంచి కోలుకొని దాదాపు 15 నెలల సుదీర్ఘ విరామం తర్వాత పంత్ ఐపీఎల్ ద్వారా క్రికెట్ లోకి తిరిగి రాబోతున్నాడు.

ఇక ఈ ఇరు జట్లు 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి పీబీకేఎస్, డీసీలు 32 సార్లు తలపడ్డాయి. అయితే ఇరు జట్లు 16 మ్యాచ్ల్లో విజయం సాధించాయి. కాకపోతే చివరి ఐదు మ్యాచ్‌లలో నాలుగింటిలో ఢిల్లీ పంజాబ్ పై ఆధిపత్యం చెలాయించింది. శిఖర్ ధావన్ నాయకత్వంలో , పంజాబ్ ఈ ఐపీల్ లో తమ అదృష్టాన్ని మార్చుకోవాలని అనుకుంటోంది. తొలి టైటిల్ కోసం పోటీపడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ధావన్ అనుభవం, దూకుడు బ్యాటింగ్ తో పాటు నాయకత్వ లక్షణాలతో పంజాబ్ ని విజయం వైపు నడిపించడంలో కీలక వ్యక్తిగా మారనున్నాడు.

ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్ రిషబ్ పంత్ వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్‌గా ఆడేందుకు అనుమతి పొందాడు. గత సీజన్ లో, పంత్ లేకపోవడంతో, డేవిడ్ వార్నర్ జట్టుకు కెప్టెన్ గా సేవలందించారు. కాకపోతే చివరి సీజన్ లో ఏకంగా జట్టు 9వ స్థానంలో నిలిచింది. మ్యాచ్ కు ముందు ఢిల్లీ కోచ్ రికీ పాంటింగ్ మాట్లాడుతూ.., "ఈసారి ఐపీఎల్ కు ముందు పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ ఎక్కువ చేసి ఉండకపోవచ్చు. అతను అదే ఫాంను తిరిగి పొందాలని చూస్తున్నాడు' అంటూ చెప్పకొచ్చాడు. ఇక టీం విషయానికి వస్తే..

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు : డేవిడ్ వార్నర్, పృథ్వీ షా, మిచెల్ మార్ష్, రిషబ్ పంత్, కుమార్ కుశాగ్రా, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, అన్రిచ్ నోర్ట్జే.

పంజాబ్ కింగ్స్ జట్టు: శిఖర్ ధావన్, ప్రభసిమ్రాన్ సింగ్, జానీ బెయిర్‌స్టో, అథర్వ తైదే, లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ, సికందర్ రజా, హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, కగిసో రబడ, అర్ష్‌దీప్ సింగ్.





## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.50 కోట్లు ఆఫర్ చేశారు..

### బీజేపీపై సిద్ధరామయ్య సంచలన ఆరోపణలు

భారతీయ జనతా పార్టీపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఆపరేషన్ కమలంలో భాగంగా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రూలింగ్ పార్టీ ఎమ్మెల్యేలను బీజేపీ పావులుగా వాడుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఇందుకోసం ఒక్కో ఎమ్మెల్యేకి బీజేపీ రూ.50 కోట్లు ఆఫర్ చేసిందన్నారు. ఈ మేరకు శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. 'ఆపరేషన్ కమలంలో భాగంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కమలం పార్టీ రూ. కోట్లు ఖర్చు చేస్తోంది. కర్ణాటకలో రూలింగ్‌లో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కూడా కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. తమ పదవులకు రాజీనామా చేసేందుకు మా ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.50 కోట్లు ఆఫర్ చేసింది. ఈ డబ్బుతోపాటు రాజీనామా చేసిన తర్వాత వచ్చే ఉప ఎన్నికలకు అయ్యే ఖర్చు కూడా తామే భరిస్తామని హామీ ఇచ్చింది' అని సిద్ధరామయ్య ఆరోపించారు. అక్రమంగా ఆస్తులు కూడబెట్టిన వారి ఇళ్లపై ఆదాయపు పన్ను శాఖ దాడులు చేస్తోందని సిద్ధరామయ్య అన్నారు. అయితే అక్రమ మార్గాల్లో ఆస్తులు కూడబెట్టిన ధనవంతులు ప్రతిపక్ష పార్టీల్లోనే ఉన్నారా..? బీజేపీలో ఎవరూ లేరా..? అని ఆయన ప్రశ్నించారు. గతంలో కూడా కర్ణాటకలో బీజేపీ 'ఆపరేషన్ కమలం' చేపట్టిందని గుర్తు చేశారు. ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామా చేసేలా డబ్బు ఆశ చూపుతోందన్నారు.

## టిల్లు స్క్వేర్‌లో అనుపమ నటన అంతకు మించి



యువ నటుడు సిద్దు జొన్నలగడ్డ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా యువ దర్శకుడు మల్లిక్ రామ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ టిల్లు స్క్వేర్. సితార ఎంటర్టైన్మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ సంస్థల పై ప్రతిష్టాత్మకంగా నిర్మితం అవుతోన్న ఈమూవీ పై అందరిలో మంచి అంచనాలు ఉన్నాయి. ఇటీవల సాంగ్స్, టీజర్, ట్రైలర్ అన్నిటితో ఆకట్టుకున్న తమ మూవీ తప్పకుండా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం అందుకుంటుందని ఇటీవల నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ తెలిపారు. విషయం ఏమిటంటే, ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తున్న అనుపమ రోల్ ఆడియన్స్ ని ఎంతో అలరిస్తుందని టాక్. ముఖ్యంగా ఆమె రోల్ లో మంచి ట్విస్ట్ ఉంటుందని, ఆకట్టుకునే అందం, అభినయంతో తన రోల్ లో అనుపమ మెప్పిస్తారని అంటున్నారు. మరి మార్చి 29న ఆడియన్స్ ముందుకి రానున్న టిల్లు స్క్వేర్ మూవీ ఏ స్థాయి సక్సెస్ సొంతం చేసుకుంటుందో చూడాలి.





## పంజాబ్‌లో కల్తీమద్యం కలకలం.. 21కి పెరిగిన మృతులు

పంజాబ్ రాష్ట్రంలోని సంగ్రూర్ జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. కల్తీ మద్యం సేవించి పదుల సంఖ్యలో ఆసుపత్రిలో చేరుతున్నారు. వారిలో ఇప్పటి వరకూ 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సంగ్రూర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇథనాల్ కలిపిన నకిలీ మద్యం సేవించి కనీసం 40 మంది ఆసుపత్రిలో చేరారు. అందులో మార్చి 20 బుధవారం నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఆ మరుసటి రోజు అంటే గురువారం నాడు పాటియాలాలోని రాజింద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మరణించారు. శుక్రవారం మరో 8 మంది, శనివారం ఐదుగురు చనిపోయారు. దీంతో కల్తీ మద్యం కారణంగా మరణించిన వారి సంఖ్య 21కి పెరిగినట్లు సంగ్రూర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే కల్తీ మద్యం కారణంగా 20 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర కలకలం రేపుతోంది. మరోవైపు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకూ ఇద్దరు వ్యక్తుల్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కాగా, గతంలో కూడా రాష్ట్రంలో కల్తీ మద్యం సేవించి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 2023లో సంగ్రూర్‌లో నకిలీ మద్యం తాగి ముగ్గురు వ్యక్తులు మరణించారు. అదేవిధంగా 2020 ఆగస్టులో రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో లూథియానాకు చెందిన ఓ దుకాణం తయారు చేసిన మద్యం తాగి కనీసం 112 మంది ప్రాణాలు కోల్పోయారు.



## బీజేపీ ఎంపీ అభ్యర్థిగా రఘురామ కృష్ణంరాజు?

తెలుగుదేశం, జనసేన పార్టీలకు కేటాయించిన పార్లమెంటు స్థానాల జాబితాలో నరసాపురం స్థానం లేదని, ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్లుగా స్పష్టమయ్యిందని రఘురామకృష్ణ రాజు గారు తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా 24 నుంచి 48 గంటల వ్యవధిలో ఎవరెన్ని టక్కు టమారా గజకర్ణ గోకర్ణ విద్యలు ప్రదర్శించినా కూటమి తరపున పోటీ చేస్తానని, నాలుగేళ్లుగా ఈ ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన తనను ఏదో రకంగా ఇబ్బంది పెట్టాలని జగన్ మోహన్ రెడ్డి గారి కనుసన్నల్లో పనిచేసే నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి గారి లాంటి నియంతను నువ్వెంత అని ప్రశ్నించిన తనను, చంపే ప్రయత్నాన్ని చేసిన ప్రతిఘటించిన తనను బీజేపీ నాయకత్వం కాదని అంటుందని అనుకోవడం లేదన్నారు. బీజేపీ అభ్యర్థిగా జగన్ మోహన్ రెడ్డి గారిని సమూలంగా రాజకీయంగా కోలుకోలేని దెబ్బతీసే విధంగా కూటమిని గెలిపించుకుందామని రఘురామకృష్ణ రాజు గారు అన్నారు. కొంత మంది పోలీసు అధికారులు ఇంకా అధికార పార్టీ నాయకుల బూట్లు నాకుతున్నారని రఘురామకృష్ణ రాజు గారు ఫైర్ అయ్యారు. పోలీసులతో పాటు వాలంటీర్లు కూడా దరిద్రంగా బిహేవ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాలంటీర్లను విధుల్లో నుంచి తప్పించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని అన్నారు.